# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-09-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 ఉపగ్రహ ప్రయోగం భారత అంతరిక్ష రంగంలో మరో గొప్ప మైలురాయిగా నిలిచిందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**

2. **పీఆర్సీ ఏర్పాటు, కరవు భత్యం బకాయిలు వంటి అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు సమావేశం కానున్నారు.**

3. **గుంటూరు జిల్లాలోని నడింపాలెంలో కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.**

4. **అక్షరాస్యత గణాంకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవాలను ప్రచారం చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు.**

=========================

రాష్ట్రంలోని శ్రీహరికోట నుంచి భారత అంతరిక్ష సంస్థ-ఇస్రో చేపట్టిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతం కావడంపై రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ ఇమేజింగ్- ఈవోఎస్-05' ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన ఇస్రో శాస్త్రవేత్తలను వారు అభినందించారు. ఈ ఉపగ్రహం దేశ రక్షణ, నిరంతర నిఘా, భూ పరిశీలన సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 విజయం భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని కొనియాడారు.

-------------------------

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. అమరావతిలోని ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో కొత్త పే రివిజన్ కమిషన్ -పీఆర్సీ ఏర్పాటు, అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నారు. అలాగే రేపు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన 173 మంది ఉపాధ్యాయుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవార్డులు ప్రదానం చేయనున్నారు.

-------------------------

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఈరోజు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వినతుల్లో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పార్లమెంట్ సభ్యులు అప్పలనాయుడు పేర్కొన్నారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈరోజు ఉదయం జరిగిన స్వామివారి అభిషేక సేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డి. రమేష్, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి.ఎం. రమేష్ వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం సి.ఎం. రమేష్ పాత్రికేయులతో మాట్లాడుతూ... అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు రావడం శుభపరిణామమని అన్నారు.ఈ జలాలలు ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరింత ఉపయోగపడనున్నాయని తెలుపుతూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

గుంటూరు నగర సమీపంలోని ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 100 కోట్ల రూపాయల కేంద్ర నిధులతో 100 పడకల ఆసుపత్రితో ఈ సంస్థను ఏర్పాటు చేయనున్నారని ఒక ప్రకటనలో వెల్లడించారు. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, దీర్ఘకాలిక నొప్పులు, శ్వాసకోశ సమస్యలు వంటి వాటికి యోగా, ప్రకృతి వైద్య విధానాల్లో చికిత్స అందించనున్నారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా సుమారు వంద నుంచి 120 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని మంత్రి వివరించారు.

---------------------------

గుంటూరు జిల్లా మంగళగిరి టెక్ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన గనులు, భూగర్భ వనరుల శాఖ ప్రధాన కార్యాలయాన్ని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన రసాయన ప్రయోగశాల, కమాండ్ కంట్రోల్ రూమ్, రికార్డ్ రూమ్, గనుల నమూనా ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. అనంతరం అన్ని జిల్లాల నుంచి హాజరైన గనుల అధికారులతో మంత్రి సమావేశమై శాఖ పనితీరు, ఇసుక నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రధానంగా ఇసుక, గనుల తవ్వకం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంతో పాటు ప్రజలకు మేలు జరిగే విధంగా శాఖలో పారదర్శకతను పాటించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

విజయవాడ రామలింగేశ్వర నగర్‌లోని ఇస్కాన్ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ పాల్గొని శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, శ్రీకృష్ణుడి బోధనలు నేటికీ మార్గదర్శకమని కృష్ణాష్టమి వంటి

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆలయ పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

-----------------------------

అక్షరాస్యత గణాంకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవాలను ప్రచారం చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈరోజు స్పందిస్తూ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అక్షరాస్యత రేటు పెరిగిందని చెబుతున్నప్పటికీ, 2026 సంవత్సరానికి సంబంధించిన అధికారిక గణాంకాలు ఇంకా వెలువడలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో 2026లో అక్షరాస్యత రేటు 82.1 శాతానికి చేరిందని ప్రభుత్వం ఎలా ప్రకటించిందో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గణాంకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు తగ్గుతున్న అంశంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని జగన్ మోహన్‌రెడ్డి సూచించారు.

-----------------------------

కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం ఈరోజు హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగింది. బోర్డు సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఇంజనీర్–ఇన్–చీఫ్ నరసింహమూర్తి, తెలంగాణ ఇంజనీర్–ఇన్–చీఫ్ రమేశ్‌బాబు పాల్గొన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలపై కమిటీ సమీక్షించింది. రెండు తెలుగు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, నిర్వహణ, రానున్న రోజుల్లో నీటి వినియోగం, జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితిపై అధికారులు ప్రధానంగా చర్చించారు.

-----------------------------

మాదకద్రవ్యాల వ్యసన నిర్మూలనలో భాగంగా ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్–ఈగల్ విభాగం, ఏలూరు జిల్లా నూజివీడు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా గంజాయి వ్యసనానికి బానిసైన ఏడుగురిని గుర్తించగా వారికి ఈగల్ ఆర్ఎస్ఐ బి. ఉదయ్ భాస్కర్ అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్ధాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై సమాచారాన్ని ఈగల్ హెల్ప్‌లైన్ 1972 లేదా పోలీసులకు తెలియజేయాలని కోరారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు, ముఖ్యంగా యువత పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

-----------------------------

రాష్ట్రంలో లాజిస్టిక్స్, విమానయాన రంగాల్లో పెట్టుబడులకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ ప్రతినిధులు మంత్రిని రాష్ట్ర సచివాలయంలో కలిసి పెట్టుబడుల అవకాశాలపై నిన్న చర్చించారు. భోగాపురం, కర్నూలు, విజయవాడ విమానాశ్రయాల్లో ఎంఆర్ఓ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సంస్థ ఆసక్తి చూపింది. విజయవాడలో ఏఎంఈ శిక్షణ, కర్నూలులో పైలట్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుపైనా చర్చించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విమానయాన, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధితో స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

--------------------------

రేపు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఈరోజు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. భారత తొలి ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని గవర్నర్ పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయులు సమాజానికి కీలకంగా నిలుస్తున్నారని గవర్నర్ అన్నారు. జ్ఞానాధారిత సమాజ నిర్మాణానికి, విద్యార్థులను ప్రగతిశీల మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎస్. అబ్దుల్ నజీర్ తెలిపారు.

=====================